క్లుప్తంగా

రూ.13వేల ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈమేరకు బండారు బ్రదర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.13వేలను వైద్యఖర్చుల కోసం ఆదివారం శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నరేందర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, రమేష్, సతీష్, వెంకన్న, బుచ్చిరాములు, బ్రహ్మం, అనిల సారంగపాణి పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేత



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో ఆటో డ్రైవర్ చిన్న వయస్సులోనే మృతిచెండటంతో, గ్రామస్తులు కలిసి రూ.63,500 బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసిన డిపాజిట్ పత్రాన్ని మృతుడి భార్యకు అందజేసి కుటుంబాన్ని అండగా నిలిచారు. మృతుడి భార్యకు ఏడాదిన్నర బాబు ఉండగా, ప్రస్తుతం ఆమె గర్భిణితో ఉంది. కార్యక్రమంలో వీరన్న, ఇందిర, నరేష్, రామచంద్రు, వీరస్వామి, ఉపేందర్, గట్టు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



తొర్రూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ విజయరత్న మాల అన్నారు. ఆదివారం నవయుగ యూత్ వారి ఆధ్వర్యంలో హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం ప్రతి వ్యక్తి మొక్కల పంపకానికి నిరంతరం కృషి చేయాలన్నారు.. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బానోతు వీరన్ననాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించే వ్యక్తి అబ్దుల్‌కలాం



నెహ్రూసెంటర్: ప్రపంచం గర్వించే గొప్ప వ్యక్తి, శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, గంగాధర్, వివేక్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, సర్వర్, వెంకన్న, వీరన్న, రఘు పాల్గొన్నారు.

గూడూరు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం చిరస్మరణీయుడని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఖాసీం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ముక్తవరం సత్యనారాయణ, బానోతు లక్ష్మణ్, బెజ్జం రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోనాల సందడి..



డోర్నకల్: శ్రావణమాసం ప్రారంభం కావడంతో డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో బోనాల సందడి ప్రారంభమైంది. స్థానిక గాంధీ సెంటర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయంతోపాటు అమ్మపాలెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మకు బోనాలు చెల్లించుకున్నారు.

ఏఎస్సైకి సన్మానం

కేసముద్రం: కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆర్.సదయ్యకు ఇటీవల ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై సదయ్యను, రూరల్ సీఐ సర్వయ్య ఘనంగా సన్మానించారు.

ఆస్పత్రి ఉంది.. సేవలు లేవు..!

- రామన్నగూడెంలో ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా



రోడ్డు పక్కన ఓ ఇంటి ముందు కూర్చొని వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్‌ఎం, ఆశ

నెల్లికుదురు: నిరుపేద ప్రజలకు వైద్యం మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం గ్రామ గ్రామాన పల్లె దవాఖానాలను నిర్మించేందుకు ఒక్కొక్కదానికి రూ.22లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో పల్లె దవాఖానాను నిర్మించి ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ ఏఎస్‌ఎం, ఆశవర్కర్లు పల్లె దవాఖానాను తెరవకపోవడంతో రోడ్ల పక్కనే ఇళ్ల ముందు గద్దెల మీద కూర్చొని ఇంటింటికి మందులు పంపిణీ చేస్తు వైద్యం అందించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రారంభించడానికి కాంట్రాక్టర్ లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా అని ప్రజల్లో తెలువదు కానీ, ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి నిర్మించిన పల్లె దవాఖానాను ప్రారంభించి, ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే ప్రారంభించాలి



గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించేందుకు పల్లెదవాఖానాలను ఏర్పాటు చేయడం మంచి పనే.. కానీ మండలంలోని రామన్నగూడెం గ్రామంలో రూ.22లక్షలతో నిర్మాణం చేపట్టిన పల్లె దవాఖానను ఆరు నెలలైనా ప్రారంభించలేదు. వెంటనే ప్రారంభించాలి. - సాయన్న, రామన్నగూడెం

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

కురవి: గ్రామపంచాయతీ కార్మికుల ప్రాణాలను హరిస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో 52వేల మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 23, 24 తేదీల్లో జిల్లాలోని గార్ల మండల కేంద్రంలో జరిగే గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, మంజూర్‌అలీ, లచ్చన్న, రమేష్, బ్రహ్మం, స్వామి, శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

పెద్దవంగర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన బండి సోమలక్ష్మి, ముక్కావుల సంతోష్, గుంటల అమృత ఇటీవల పలు కారణాలతో మృతి చెందగా ఆదివారం మాజీమంత్రి బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు నిత్యం అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, నాయకులు పాలకుర్తి యాదగిరి రావు, శ్రీరాం సంజయ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: అనేక కారణాలతో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తోడుగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పోలెపల్లి, కంఠాయాపాలెం గ్రామాల్లో మృతి చెందిన పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, హనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, నలమాల ప్రమోద్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు అలువాల రాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘన నివాళి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లారిగూడెం గ్రామానికి చెందిన రామడుగు వెంకట నర్సింహారావు (90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ నివాళులర్పించారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న పొమ్మన్న

నెహ్రూసెంటర్: వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు చర్య తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనప పొమ్మన్న, బండపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘ ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన యూరియా కొరత ఏర్పడుతుందని, రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని తెలిపారు. నాట్లు వేసేందుకు సిద్ధమైన రైతులకు యూరియా కొరత సమస్యగా మారిందని పేర్కొన్నారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎండీ షర్ఫుద్దీన్, దేవరపల్లి నర్సిరెడ్డి, దారావత్ సుమన్ పాల్గొన్నారు.

తండాలను రెవెన్యూ జీపీలుగా గుర్తించాలి



మాట్లాడుతున్న బోడ రమేశ్‌నాయక్

నెహ్రూసెంటర్: తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలను జీపీలుగా ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా, అభివృద్ధి లేక తండాలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తండాల అభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేయాలని, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు, హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. ఎస్టీ రిజర్వేషన్ 14శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న హైదరాబాద్‌లో జరగనున్న సంఘం రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తేజావత్ వాసునాయక్, బాలాజీనాయక్, హత్తిరాం, భూక్య లాల్‌సింగ్, చక్రవర్తి, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని శ్రీభక్త మార్కండేయ శివాలయంలో రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భూమి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ సర్పంచ్ మల్లిరెడ్డి సుధఅ ర్జున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా వేదపండితులు మంత్రోచ్ఛరణాలతో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కైరంకొండ వీరన్న, కార్యదర్శి తవటం శ్రీనివాస్, కోశాధికారి వడ్డేపల్లి రాజేంద్రప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ములుక కృష్ణమూర్తి, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు, చిట్యాల జనార్దన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తండాలు, గ్రామాలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: తండాలు, గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకుండా, అభివృద్ధి చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసేలా కుట్రలు చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విమర్శించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి సర్పంచ్‌ల ఆత్మహత్యలకు పాల్పడేందుకు కేసీఆర్ కారణమయ్యారని ఆరోపించారు. ఆగస్టు 2వ తేదీన గూడూరు మండల కేంద్రంలో జరగనున్నన గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లావుడ్యా రాము నాయక్, మాలోత్ రవీందర్‌నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, యాక్యానాయక్, బాలాజీ, బిచ్యా, రాము, విజయ్, రాగం మల్లయ్య, బావ్‌సింగ్, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మహోదయ రెసిడెన్షియల్ స్కూల్ 1993–94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహోదయ వెంకన్న, ఉపాధ్యాయులు ఐలయ్య బుచ్చిరాములు, పూర్వ విద్యార్థులు వంగ శ్రీనివాస్, రామనాథ్, సుబ్రహ్మణ్యం, కిశోర్, కుమారస్వామి, శ్రీపతి, లక్ష్మి, శోభిత, మంజుల, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నల్లబెల్లం పట్టివేత

తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులోని కొమ్మనపల్లితండాకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై 500కేజీల నల్లబెల్లం తీసుకెళ్తుండగా పట్టుకుని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గాయాలు

నర్సింహులపేట: మండలంలోని గోపతండాలో జీపీ సిబ్బందిగా పని చేస్తున్న అజ్మీర బాలకిషన్‌కు ఆదివారం విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలు కావడంతో అతడిని 108లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

జర్నలిస్టులకు పింఛన్ ఇవ్వాలి

నెల్లికుదురు: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులకు బిహార్ తరహాలో పింఛన్లు అందించి ఆదుకోవాలని సీనియర్ జర్నలిస్టు పంజాల వాసుదేవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బిహార్ జర్నలిస్టులకు గతంలో అందిస్తున్న పింఛన్ రూ.6వేల నుంచి రూ.15వేలకు పెంచి ఇవ్వడం జర్నలిస్టులపై బిహార్ ప్రభుత్వానికి ఉన్న ఔదార్యమన్నారు.

శ్రీసత్యసాయి సహస్రనామార్చన

మహబూబాబాద్ రూరల్ : భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలో ఆదివారం శ్రీసత్యసాయి సహస్రనామార్చన, ప్రేమ తరువు మొక్కలునాటే కార్యక్రమాలను సాయి భక్తులు సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వందనం కమల్ కుమార్, శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా యువ సమన్వయకర్త ప్రదీప్, ఆలయ కమిటీ సభ్యులు బవిరిశెట్టి నారాయణరావు పాల్గొన్నారు.

సాగు భూములు లాక్కోవడం సరికాదు



మరిపెడ రూరల్: పేదలు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కృష్ణవేణికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన భగవంతయ్య భూమిని రెవెన్యూ అధికారులు డెవలప్‌మెంట్ పేరుతో బలవంతంగా భూసేకరణ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

పాలు, పండ్లు పంపిణీ



గార్ల: గార్ల మండలవాసి బాదావత్ వెంకన్న జాదవ్ ఐఆర్‌టీఎస్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించగా, తొలిసారి ఆదివారం ఆయన గార్లకు రావడంతో గ్రామస్తులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఐఆర్‌టీఎస్ అధికారి గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, బ్యాంకు మేనేజర్, యాకూబ్ నాయక్, గూగులోత్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నెల్లికుదురు: మండల కేంద్రంలో కొలువై భక్తుల కోర్కెలు తీరుస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి (సోమవారం) ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జోరుగా వరి నాట్లు

మరిపెడ రూరల్: మండలంలో రైతులు జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. ఇటీవల మూడు రోజులుగా కురిసిన మోస్తరు వర్షానికి రైతులు పొలాలు దున్ని వరి సాగు చేపడుతున్నారు. భారీ వర్షాలు కురవని కారణంగా చెరువుల్లోకి నీరు చేరుకోలేదు. చెరువుల కింద సాగు రైతులు మాత్రం ఇంకా పొలాలు దున్నడం మొదలు పెట్టలేదు. కేవలం బావుల కింద రైతుల మాత్రమే ముందుగా సాగు చేపడుతున్నారు.

తగ్గిన పాకాల ఏటి వరద ఉధృతి

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటి వరద ఉధృతి ఆదివారం కొంతమేర తగ్గింది. పాకాల చెక్ డ్యాంకు ఇరువైపుల వరద ఉధృతి కొనసాగుతుంది. రాంపురం, మద్దివంచ గ్రామ పంచాయతీల గ్రామాల ప్రజలకు మాత్రం రాకపోకలు కొనసాగడం లేదు. ఈ ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే రైల్వే బ్రిడ్జి పైనుంచి నడుచుకుంటూ గార్లకు వచ్చి నిత్యావసరాలు తీర్చుకుంటున్నారు. ఎరువుల బస్తాల కోసం మాత్రం రైతులు పక్క మండలాలైన డోర్నకల్, బయ్యారం మండలాలకు ఆటోల ద్వారా వెళ్లి తెచ్చుకుంటున్నారు.

ఆగస్టు 10న బోనాల వేడుకలు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేసముద్రంస్టేషన్‌లో వచ్చే ఆగస్టు నెల 10వ తేదీన బోనాల పండుగను నిర్వహించనున్నట్లు బొడ్రాయి ముత్యాలమ్మ గుడి ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు జాటోత్ హరీశ్ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో కులసంఘాల పెద్దలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, నాగేశ్వర్‌రావు, వీరునాయక్, వెంకన్న, మురళీ, వసంతరావు, రమేశ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో కమ్యూనిటీ హాల్



శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం

గార్ల: గార్లలో 2009 సంవత్సరంలో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు నాటి ఖమ్మం జిల్లా జెడ్పీ చైర్మన్ చందా లింగయ్య దొర నిధులు మంజూరు చేయడంతో నిర్మించారు. నాటి నుంచి హాలుకు ఆలనపాలన కరువవడంతో భవనం ప్రస్తుతం వర్షం వస్తే పూర్తిగా కురుస్తుంది. కిటికీలు పూర్తిగా చెదలు పట్టాయి. గతంలో ఈ భవనంలో చిన్న పాటి శుభకార్యాలు, వివిధ పార్టీల నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు సమావేశాలు పెట్టుకునే వారు. భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని యువజన సంఘం నాయకులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త



మెకానిక్ షెడ్డులో ఆరు నెలలుగా ఉంటున్న మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్



ఓ ఇంటిలో పేరుకుపోయిన చెత్త

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల ఇళ్లల్లో చెత్త పేరుకుపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు వారాలుగా కొన్ని వీధుల్లో చెత్తను సేకరించకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రధాన వీధులను మాత్రమే శుభ్రపరిచి చెత్తను సేకరిస్తూ ఇతర వీధులను విస్మరిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీలో 2020లో చెత్త సేకరించడానికి మూడు ట్రాక్టర్లు, మూడు టాటా ఏస్ వాహనాలను కొనుగోలు చేశారు. ఆరు నెలలుగా ట్రాక్టర్, టాటాఏస్ వాహనాలు మూలనపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయించడం లేదు. నిత్యం మరమ్మతులకు గురవుతుండటంతో చెత్తసేకరణ సక్రమంగా జరగడం లేదు. దీనికితోడు పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉంది. వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిం, పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి, సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు సమాజానికి ఆదర్శం

- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: లయన్స్‌క్లబ్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టారు. లయన్ తంగెళ్లపల్లి మల్లికార్జున్ చారి అధ్యక్షుడిగా, రాపోలు శ్రీనివాస్ కార్యదర్శిగా ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఝాన్సీరెడ్డి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చంద్ర శేఖర్ ఆర్య, సుధాకర్ రెడ్డి, లక్ష్మీనర్సింహ రావు, ఏదునూరి శ్రీను, రేణుక, శారద, వెంకన్న, సురేష్, ముత్తినేని శ్రీనివాస్, ఎర్ర వెంకన్న, అనపురం రవి, సోమన్న, సుభాష్, ఉషయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

మహబూబాబాద్ రూరల్: జాతిని జాగృతం చేసిన మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని మాధవపురం గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నూకల అభినవరెడ్డి, మద్ది వెంకటరెడ్డి, బొబ్బ వెంకటరెడ్డి, కొమిరెల్లి పాపిరెడ్డి, నూకల రవి, ఉప్పలయ్య, అన్వేష్, రాసాల లింగన్న, నగేష్, ఎండి.ఇమామ్, మాలోత్ వెంకన్న, సంజీవరావు, తప్పెట్ల వీరన్న, నీరుడు సామేలు పాల్గొన్నారు.